వర్ని మండలం తగిలేపల్లిలో బతుకమ్మ వేడుకలు..

నిజామాబాద్ రూరల్ మండలంలోని కొండూర్‌లో..

గ్రామాల్లో 'బతుకమ్మ' సందడి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 19 : జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మను గురువారం నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రంతోపాటు దోమలెడ్గిలో, వర్ని మండల కేంద్రంతోపాటు తగిలేపల్లి, జలాల్‌పూర్ తదితర గ్రామాల్లో, రూరల్ మండలంలోని కొండూర్‌లో మహిళలు బతుకమ్మలను వివిధ రకాల పూలతో పేర్చి ఆడిపాడారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. చందూర్ మండలంలోని లక్ష్మాపూర్, గోపూర్, చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని భారత్‌గ్యాస్, సావేరా గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. గ్యాస్ ఏజన్సీలో పని చేసే సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. రెంజల్ మండలంలోని రెంజల్, దూపల్లి, కళ్యాపూర్, సాటాపూర్, బోర్గాం గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు అంబారాన్నంటాయి. సాయంత్రం పలు విధుల్లో మహిళలు బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి, సర్పంచులు మార్ల రమేశ్‌కుమార్, శనిగరం సాయిరెడ్డి, వికార్ పాషా, కాశం నిరంజని, పార్థేవాణి సాయిరెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కాశం సాయిలు, ఎంపీటీసీలు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సంబురాల్లో పాల్గొన్న స్పీకర్ పోచారం

రుద్రూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మహిళలతో బతుకమ్మ ఆడారు. అనంతరం స్పీకర్‌ను మహిళలు సన్మానించారు. రుద్రూర్‌లో ఐదు గౌరమ్మలతో కలిపి ఒకే బతుకమ్మగా పేర్చిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో స్పీకర్ వెంట జడ్పీటీసీ నారోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, వైస్ఎంపీపీ సాయిలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..

రెంజల్ మండలం దూపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మంత్రి వేములకు పరామర్శ

మంత్రి వేములను పరామర్శిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

వేల్పూర్, అక్టోబర్ 19: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందగా గురువారం మంత్రిని వేల్పూర్‌లోని వారి నివాసంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, మిత్రులు శ్రేయోభిలాషులు పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

పోలీసు అమరుడి కుటుంబానికి ..

మెండోరా, అక్టోబర్ 19: చాకిర్యాల్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ఓడ్నాల నర్సయ్య 1991 ఆగస్టు 3న డిచ్‌పల్లి పరిధిలో నక్సలైట్ల మందుపాతర పేలడంతో మృతి చెందాడు. పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా బాధిత కుటుంబాన్ని జిల్లా సీపీ ఆదేశాల మేరకు ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్ పరామర్శించారు. కానిస్టేబుల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు పోలీసుశాఖ అండగా ఉంటుందని తెలిపారు. వారి వెంట ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్, మెండోరా, బాల్కొండ ఎస్సైలు శ్రీనివాస్, గోపి తదితరులున్నారు.

యాదవ మహాసభ మండల అధ్యక్షుడి ఎన్నిక

నందిపేట్, అక్టోబర్ 19: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మండల యాదవ కమిటీని ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు గురువారం తెలిపారు. మాయాపూర్ గ్రామానికి చెందిన దుడ్డెల్ల కిష్టన్న యాదవ్‌ను మండలానికి చెందిన యాదవులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రానికి చెందిన విజయ్ కుమార్ యాదవ్‌ను అఖిల భారత యాదవ మహాసభ యూత్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విస్తృతంగా తనిఖీలు చేయాలి

మెండోరా, అక్టోబర్ 19: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనిఖీలు విస్తృతం చేయాలని ఏసీపీ జగదీశ్ చందర్ పోలీసులకు సూచించారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై పోచంపాడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఏసీపీ గురువారం పరిశీలించారు. వాహనాల తనిఖీలు విస్తృతం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం, డబ్బులను తరలించకుండా చూడాలని సీఐ, ఎస్సైలకు సూచించారు. వారి వెంట సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఏసీపీ జగదీశ్

మద్యం సీసాలు స్వాధీనం

నవీపేట, అక్టోబర్19: మండంలోని యంచ వద్ద మహారాష్ట్ర నుంచి అక్రమంగా మోటర్ సైకిల్‌పై తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ ఎస్సై పోతన్న రెడ్డి గురువారం తెలిపారు. బుధవారం రాత్రి సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై తరలిస్తున్న మద్యం పట్టుబడినట్లు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వాటిని తరలిస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బేశేశ్వర్, మహారాష్ట్రకు చెందిన మధురైన ఇర్బా అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు చెప్పారు. రూ.75 వేల విలువైన మద్యం బాటిళ్లతోపాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

యంచ చెక్‌పోస్టు వద్ద మద్యం తరలిస్తున్న వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు

బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు వెళ్లి వ్యక్తి మృతి

ఎడపల్లి, అక్టోబర్ 19: మంగళ్‌పాడ్ గ్రామంలో తక్కెల సతీశ్(40) చెరువులో పడి గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించారు. బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు చెరువులోకి వెళ్లిన తక్కెల సతీశ్ తిరిగి వచ్చే క్రమంలో నీటిలో మునిగిపోయడు. గ్రామస్తులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించింది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

సాటాపూర్ సర్పంచ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు

బీఆర్ఎస్‌లోకి వలసల జోరు

రెంజల్, అక్టోబర్ 19: సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను కేసీఆర్ ప్రకటించిన తర్వాత బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలోని సాటాపూర్ గ్రామంలో పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 30 మంది యువకులు గురువారం సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ వికార్‌పాషా ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సర్పంచ్ ఆహ్వానించారు. ఎంపీటీసీ హైమద్, ఉప సర్పంచ్ లత సాయిలు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల భూమేశ్, శ్రీకాంత్, ఇమ్రాన్, నరేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు వేళల సూచిక బోర్డు ఏర్పాటు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 19: బషీరాబాద్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆర్టీసీ బస్‌స్టాప్ వద్ద బస్సు వేళల సూచికా బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ఆర్టీసీ అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ సక్కారం అశోక్ ఈ బోర్డును ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మాధవీలతకు సన్మానం

కవయిత్రి మాధవీలతను సన్మానిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్స్

బోధన్, అక్టోబర్ 19: పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాల, ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కవయిత్రి, సినారే సాహితీ పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సాహిత్య పురస్కార గ్రహీత పొద్దుటూరి మాధవీలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమెను ఉషోదయ కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఉషోదయ విద్యాసంస్థల డైరెక్టర్ సునీత దుష్యంత్, ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మచ్చర్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ పోటీలు

శక్కర్‌నగర్, అక్టోబర్19: బోధన్ పట్టణంలో ఆర్యసమాజ్, దయానంద్ గోశాల ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్యసమాజ్ బోధన్ శాఖ ప్రధాన్ చిదుర ప్రదీప్ గుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దయానంద్ గోశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ బతుకమ్మ పోటీలు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ ఆడిన ఉత్తమ బృందాలకు బహుమతులు ఇస్తామని తెలిపారు. పట్టణంలోని మహిళలు, విద్యార్థినులు, బాలికలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రెంజల్, అక్టోబర్ 19: సాటాపూర్‌కు చెందిన మస్కూర్ సాయిలు ఇటీవల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా గురువారం బాధితుడికి పోలీస్ స్టేషన్‌లో ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల ఫోన్ పోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో వెతికి ఆచూకీ తెలుసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్సై సూచించారు.

లారీ ఢీ.. ఒకరు మృతి

ఎడపల్లి, అక్టోబర్ 19: మండలంలోని జన్కంపేట్ గ్రామంలో గురువారం లారీ ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై విక్రం తెలిపారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... నవీపేట్ మండలం అబ్బాపూర్‌కు చెందిన నీరడి సాయన్న (40) స్నేహితుడితో కలిసి నిజామాబాద్‌కు పని నిమిత్తం బైక్‌పై బయల్దేరాడు. జానకంపేట్ శివారులో వేగంగా వచ్చిన లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. నీరడి సాయన్నపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.